# నక్షత్రం

మరొకరి జీవితం కోసం ఖర్చుపెట్టే కొన్ని కాసులు వాళ్ళకే కాదు-
మనకీ ఆనందపు రుచిని చూపిస్తాయి. – జయప్రద

పూరి గుడిసెలు... మధ్య తరగతి ఇళ్ళు... పెద్ద మేడలూ అన్నీ ఒకేచోట వెలసిన 'సమ సమాజం' లాటి కాలనీ అది.

ఈరోజు ఓ గుడిసె ముందు నడిరోడ్డులో పొద్దుటి నుంచి ఓ పేదవాడి కడుపాకలికి, ఓ పసిబిడ్డ గాఢమైన ఆశకు ఘర్షణ జరుగుతోంది.

"ఊహుం... నేను పనికిపోను. నేను చదూకుంటారా అయ్యా!" పన్నెండేళ్ల కన్నడి మాటల్లో బలమైన నిర్ణయం ఉంది, ఆ నిర్ణయం తాలూకు మొండితనం ఉంది... తండ్రిని ప్రసన్నుణ్ణి చేసుకునే ప్రార్థనా ఉంది.

నల్లటి, నున్నటి కన్నడి శరీరం మీద మరో దెబ్బ వేసిన కన్నడి తండ్రి తిరుపతి గుండెలు నొప్పెట్టాయి.

"అయ్యా! నన్ను పెద్ద స్కూల్లో చేర్చయ్యా!" అదే మాట మళ్లీ మళ్లీ. కన్నడు తండ్రి చేతిలోని కఱ్ఱకు భయపడడం లేదు. అవిరామంగా ప్రార్థిస్తూనే వున్నాడు.

"ఒరే కన్నా! ఇస్కూలు సదువులు మనకు ఈలవదురా! మాటిమాటికి అడిగి నన్ను ఇరకాటంలో పెట్టమాకరా!" తిరుపతిని నిస్సత్తువ చుట్టేస్తోంది. ఒకపక్క కన్నబిడ్డ ఆశ... మరోపక్క ఎంతకీ తీరని అప్పు!

తండ్రి నిస్సహాయ ధోరణి చూసి ఈసారి కన్నడు తండ్రికి ఎదురుతిరిగాడు –

"ఎందుకు ఈలవదు? ఈలవద్దిలే... నేను చదూకూంటానంతే!"

"అద్దదే... వద్దనేది! నాయుడయ్య దగ్గర చేసిన అప్పులో ఒక్క పైసా అన్నా కట్టేమట్రా? ఆ మారాజు దయతలచి నిన్ను ఆళ్ళ రొయ్యలగుంటల కాడ నాలుగేళ్లు పెట్టుకుంటే... అప్పు

తీరిపోద్దని నాకే ధైర్నం చెప్పాడు... పాపం మారాజు!" విసుగు, నిస్సహాయత, కోపం... అన్నీ కలిపిన మిశ్రమ బాధ ఉంది అతని మాటల్లో. కానీ, కన్నడు ఇవన్నీ పట్టించుకోలేదు.

"నాయుడయ్యకు నేను చెప్పుకుంటాలే అయ్యా!" వాడి పసికళ్ళు ఆశగా చూస్తున్నాయి.

తిరుపతి విసుగ్గా కొడుకును దూరంగా నెట్టాడు. పెద్దదానికి చేయాల్సిన మనువు, సంపాయించలేని రోగిష్టి పెళ్ళాం, 'అసలు' కంటే మించిపోతున్న వడ్డీలు... ఇవన్నీ కలిపి తిరుపతిని పిచ్చివాణ్ణి చేస్తున్నాయి.

స్నాన సంస్కారం లేని కన్నడి వీపు మీద మరో దెబ్బ పడింది.

"నాలుగేళ్లు కళ్ళు మూసుకుంటే అప్పు తీరిపోద్ది... చెప్తే ఇంటాడా? ఎదవ... ఎదవా అని..." మరో దెబ్బ... మరో దెబ్బ..!

ఇంతవరకు చదువుకోవాలనే ఆశతో అన్ని దెబ్బల్నీ నిశ్శబ్దంగా భరిస్తున్న కన్నడు- ఈసారి దెబ్బకు "అబ్బాః..." అన్నాడు. తిరుపతి చేతిలోని కట్టె జారి క్రిందపడింది.

"ఒరే తిరుపతీ! ఏందిరా అదీ? ఆడి నెందుకట్టా గొడ్డును బాదినట్టు బాదుతుండావు?"

అది రక్తపాశం తాలూకు తీవ్ర నిరసన... అది గుడిసెలో నుండి వినవచ్చిన శబ్దం.

"కడుపు పగిలేట్టు గంజి తాగావు కదా! చాల్దా? ఇంక నీకెందుకీ సోది? గమ్మున తొంగోరాదా?" కన్నకొడుకు కనీసపు ఆశ తీర్చలేని గానుగెద్దు బ్రతుకును శపించుకుంటూ తనను కన్నతండ్రిని కేకలేశాడే గానీ, తిరుపతికీ తెలుసు... జానెడు పొట్టకు లొంగిపోయి ఆకాశమంత బిడ్డ భవిష్యత్తును ఆర్పేస్తున్నానని.

"అయ్యా... కొట్టబాకయ్యా! మనం 'బి.సి.లం' కదయ్యా... నా చదువుకు ఖర్చంతా గవర్నమెంటోళ్ళు చూసుకుంటారంటయ్యా!"

వంగి కట్టె అందుకుని విసిరి పారేద్దామనుకుంటున్న తిరుపతి ఉలిక్కిపడ్డాడు.

'ఎంత నిర్దయుడు తను? పాపం... కన్నడు! కోరరాని కోరిక ఏమి కోరాడనీ..? చదువుకోవాలని కోరడం పెద్ద నేరమా?' మైనపొత్తిలా కరిగిపోతున్నాడు తిరుపతి. కానీ, 'జన్మ నక్షత్రం'లా తననే అంటుకొనివున్న అప్పులు అతన్ని భయపెట్టున్నాయి. కరిగిన మైనం తిరిగి గడ్డకడ్తోంది. అతను కావాలని కొనితెచ్చుకొన్న కఠినత్వాన్ని జాగ్రత్తగా కూడగట్టుకుంటున్నాడు. మానవత్వాన్ని దానవత్వం మరుగున భద్రంగా దాచేస్తూ, వెటకారంగా అన్నాడు-

"నిన్ను సరే... ఆళ్ళు సతికిస్తారు. నీ పొట్టకు కూడెవడెడ్తాడ్రా? నా ఎదాన బడి ఇంగా మింగాలనుకుంటున్నావా?"

తండ్రి మాటల్లో వాడు ఓ చిరు ఆశను ఏరుకుంటుంటే... నాలుగు బారల దూరంలో తన పెంకుటింటి ముందు వాకిట్లో కూర్చుని జంధ్యం అల్లుతున్న ముసలి బ్రాహ్మడు నిట్టూర్చాడు.

'బి.సి.'గా పుట్టున్నా ఎంత బాగుండేది! తమది 'హైక్లాస్ పుట్టుక' అని తమ బిడ్డలకు స్కూళ్ళల్లో సీట్లు రావు... చదువుకోను డబ్బులు ఉండవు... వాళ్ళు కూడా ఇలాగే చావుకీ, బతుక్కీ మంత్రాలు చదువుతూ, అందరినీ ఆశీర్వదిస్తూ తమకే ఎలాంటి ఆశీస్సులు, అండదండలు అందకుండా ఖాళీటైములో అల్లుకునే జందెం అమ్ముకుంటూ... బతికేస్తున్నారు.

"నిన్ను అడగనయ్యా! ఆడ ఈడ ఆడుక్కు తినైనా చదూకుంటానయ్యా..." చప్పున వంగి తండ్రి కాళ్లను చుట్టేశాడు కన్నడు.

తిరుపతిలో శారీరకంగా, మానసికంగా కూడా శక్తి హరించుకుపోయింది. అతను కూలబడిపోయాడు.

"ఏందిరా కన్నయ్యా! అణ్ణి అట్టా ఇసిగిస్తుండావు? ఆ సదువులు సట్టుబండలు మనకేడ గానీ... మీ అయ్యను రమ్మను- తానానికి నీళ్లెట్టాను!" లోపలి నుంచి వచ్చిన కేకతో తల్లిని అర్థించకుండానే తల్లి సపోర్టు తనకు ఉండదని కన్నడి చిట్టిబుఱ్ఱకు అర్థమైపోయింది.

అక్కడ చేరి వినోదం చూస్తున్న గుంపులో నుంచి ఓ యువకుడి గొంతు ఖంగుమంది-

"చైల్డ్ లేబర్... చట్ట విరుద్ధమని వీళ్ళకు తెలిసినట్టు లేదు. ఒక్కసారి పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఆ పిల్లాడు తన తండ్రి తనని పనిలోకి పంపిస్తున్నాడని కంప్లయింట్ ఇస్తే చాలు- ఈ పెద్దాయనెళ్లి జైల్లో కూర్చోవాల!"

కన్నడు ఒక్కక్షణం గుంపులోకి చూసి తల వంచుకున్నాడు. వాడికి తండ్రిని జైల్లో పెట్టడమనేది ఇష్టంలేని సంగతి. కానీ, చదువుకోవాలని మాత్రం ఉంది.

కూలిపని పూర్తిచేసుకుని ఇంటికి వస్తున్న అప్పలస్వామికి కన్నడి నిశ్శబ్ద భావప్రకటన, వాడి మనసు అర్థమయ్యాయి. అప్పలస్వామి మనసు ముప్పయ్యేళ్లు వెనక్కు నడిచింది...

ఇదే దృశ్యం... ఇదే దండన... ఇదే మందలింపు... ఇదే శాసనం! కాకపోతే- అప్పుడు తిరుపతి స్థానంలో తన జీవితాన్ని కూలిబతుక్కి అంకితం చేసిన తన తండ్రి, కన్నడి స్థానంలో తను. అతని మనసు మూలిగింది. తాను ఈ తరంలో పుట్టుంటే ఎంత బావుండేది?! తండ్రిని జైలుకు పంపించైనా తాను చదువుకొనుండేవాడు. ఇప్పుడనుకుని ఏం లాభం? సగం బతుకు తెల్లారిపోయాక?!

గుంపులో ఉన్న కొందరు మరోలా ఆలోచిస్తున్నారు... 'ఈ పిలగాళ్ళను చదివిస్తే ఇంకేవన్నా ఉందా? ఆడి జీతం, ఆడు, ఆడిపెళ్ళాం, పిల్లలు... అంతే! అప్పుడాడికి అప్పులు గుర్తుకురావు. పైగా, గుడిసె బతుకు రోత పుడ్తది!'

బడి నుంచి అప్పుడే వచ్చిన కన్నడి చెల్లెలు సీతకు హఠాత్తుగా అన్న కొత్తగా పనిలో చేరిన సంగతి గుర్తొచ్చింది. వెంటనే ఆ పిల్ల మనసులోకి ఓ కోరిక వచ్చింది. ఆ కోరికను ఇక్కడ బహిర్గతం చేయకూడదనే జ్ఞానం ఆ పిల్ల వయసుకు లేదు.

"అన్నో,... నువ్వు... పన్లో చేర్తివే... నాకో గౌను కొనీవా?" అని అడిగేసింది సీత.

చెల్లెలి ఆశానేత్రాలు చూస్తూనే కన్నడిలోని గాఢనిర్ణయం కొద్దిగా సడలింది. వెంటనే పనిలో చేరిపోయి నాయుడయ్యను పాతిక రూపాయలడిగి చెల్లెలికి గౌను కొనేయాలనిపించింది. కానీ, మరుక్షణంలో తను చదివి, ఉద్యోగం చేసి, ఆ పిల్ల బట్టలు ఆ పిల్లే కొనుక్కొనేలా ఆ పిల్లనూ చదివించాలని కూడా అనిపించింది.

సీత ఆశగా చూస్తోంది. కన్నడు నిరాశగా నిలబడున్నాడు. అలా నీరసంగా నిలబడున్న అన్నను చూస్తే... వాడు తనకు ఫ్రాక్ కొనిస్తాడనే నమ్మకం పోయింది సీతకు.

అన్న తానంలో తనుంటేనా! అమ్మానాయన్ని ఇట్టా ఏడిపిస్తదా? ఎంటనే పాచిపనికి చేరేసి, డబ్బులు సంపాయించేసి, ఒక్కటే- ఒక్కటంటే ఒకటే... పట్టుపావడా కొనుక్కోని, మిగతాదంతా అమ్మ కిచ్చేయదూ..?!

సీత వయస్సు ఇప్పుడు ఆరేళ్లు. ఇంకా రెండేళ్లు తల్లీతండ్రీ ఆ పిల్లను సాకితే చాలు- ఆ తర్వాత ఆ పిల్లే వాళ్ళని సాకుతుంది.

కన్నడిలోని ఆశ- ఆశగా అందరివైపు చూస్తోంది. 'ఎవరైనా సరే... తనకు ఓ మంచి జీవితాన్నిస్తే వాళ్ళకి జీవితాంతం ఋణపడి ఉంటాను' అన్నట్టు చూస్తోంది.

పొద్దుటినుంచి ఎదురింటి మేడ మీద నుంచి తమని గమనిస్తున్న యశోదను మాత్రం వాడు గుర్తించలేదు.

మేడ కొనుక్కుని ఈ ఇంటికి వచ్చినప్పుడు భర్తను విసుక్కుంది యశోద- 'ఇలాంటి లొకాలిటీలో ఏం ప్రశాంతత ఉంటుందీ..?' అని. కానీ- భర్త బ్యాంక్‌కు, పిల్లలు స్కూల్‌కు వెళ్లిపోయాక ఏమీ తోచక బాల్కనీలో కూర్చుంటే... చిన్న గుడిసెల్లో ఇరుకుగా కాపురం చేస్తున్న జనాభా, ఆర్థిక దౌర్బల్యం వల్ల వాళ్ళల్లో వచ్చే తగవులు... సభ్యతా, సంస్కారాన్ని పాటించని వాళ్ళ ఆకలి... ఇవన్నీ ఒక ఎత్తు అయితే- ఈనాడు జరుగుతున్న ఆర్థిక దౌర్బల్యం తాలూకు పరాకాష్టకు ప్రతీకను చూసిందామె.

ఆమె మనసు కదిలింది.

తను చాలామందిని చూసింది... ఎంతోమంది గురించి విన్నది. సర్వం జరుపుతూ చదువుకోమంటే... చదువుకోనని మొండికేసే తన బిడ్డల్ని.., బళ్ళో చేర్చుకోవడానికి గవర్నమెంట్ ఆదేశం ప్రకారం పిల్లల్ని బడికి తీసుకెళ్లడానికి వచ్చిన టీచర్‌కి దొరక్కుండా తప్పించుకునే పేదపిల్లల్ని.., ఆటలో పడి చదువు మానేసి చంటిబిడ్డలను ఆడించను పనిపిల్లల్లాగా మిగిలిపోయిన చిన్నారుల్ని... తండ్రి చదువు మానిపించేస్తాడని ఆనందపడే అజ్ఞానుల్ని.., అందరూ చదువుకుంటే పల్లకీలు ఎవరు మోస్తారనే జనాల్ని.., ఇంకా... ఇంకా...

కానీ, తండ్రిని ఎదిరించి చదువుకుంటానంటున్న బిడ్డను చూడడం ఆమెకు ఇదే ప్రథమం! కన్నడిని చూస్తే ఆమెకు ముచ్చటేసింది.

కింద నడివీధిల్లో నిర్లజ్జగా జరిగే ఆ సభా కార్యక్రమం పూర్తయినట్టుంది. అందరూ కదిలి వెళ్లబోతున్నారు.

యశోదకు స్పృహ వచ్చినట్టయింది. గబగబ మెట్లన్నీ దిగేసి, తన కాంపౌండ్ గేట్లోకి వచ్చి నిల్చుని... కదిలి వెళ్లబోతున్న తిరుపతినీ, కన్నయ్యనూ పిలిచింది. ఏదీ తేల్చకుండా ముగిసిపోయిన అసెంబ్లీ పట్ల అసంతృప్తితో వెనక్కి తిరిగిన జనానికి ఆ పిలుపు కొత్త ఉత్సాహాన్నిచ్చింది. అందరూ అక్కడే ఆగిపోయారు.

యశోద సిగ్గుపడలేదు, సంకోచ పడలేదు... నేరుగా కన్నడి దగ్గరకు వచ్చి- అతని తైలసంస్కారం లేని రింగుల జుట్టులోకి వేళ్ళు పోనిస్తూ...

"కన్నా! నేను చదివిస్తాను... చదువుకుంటావా?" అంది.

వాడు చదువుతానన్నట్టు సంబరంగా తల వూపాడు.

తిరుపతి ఒక్కడుగు ముందుకేశాడు.

"అమ్మా! మీరు చదివిస్తానంటున్నారు... దండాలు! కానమ్మా... మా అప్పులు తీరే దెట్టా? బిడ్డల్ని కనుకున్నది ఎందుకమ్మా... ఇట్టాటప్పుడు ఆదుకోకపోతే?!"

ఆమె నిట్టూర్చింది.

"వీడు నీకు సంవత్సరానికి ఎంత సంపాయించి పెడ్తాడు?"

"ఎట్టా లేదన్నా... ఏడాదికి ఆరేలు!"

"అయితే... ఆ డబ్బు నేను నీకిస్తాను. వాడు చదువుకున్నంత కాలం ఇస్తాను. వాడిని చదువుకోనీ..!"

కన్నడికి ఆకాశాన్ని గెలుచుకున్నంత ఆనందంగా ఉంది. 'ఆనందం' అనే పదానికి నిజమైన అర్థాన్ని వాడి కళ్ళల్లో స్పష్టంగా చూసింది యశోద.

చదువు రాకనో... చదువుకోకనో... కూలీలుగా మారిన వాళ్ళను వదిలేసినా- వేలాది, లక్షలాది మంది పేద పసివాళ్ళల్లో ఎవరు నక్షత్రాల్ని తాకుతారో తెలుసుకోకుండానే... అలాంటి బాలల భవిష్యత్తును మొగ్గలోనే సమాధి చేయడం ఎంత నేరం?!

"అయితే... అమ్మగారూ! మా చెల్లెలికి ఓ గౌను కూడా కొని పెడ్తారా?"

మొదట్లో ధైర్యంగా మొదలెట్టిన వాడు ఆఖరి పదానికి వచ్చేసరికి భయంతో బిగుసుకుపోయాడు.

తనలో ముసురుకుంటున్న ఆలోచనల్నుండి తేరుకుని చిన్నగా నవ్వింది యశోద.

"ఆc... కొనిస్తాను."

కన్నడు ఆశగా... సంబరంగా... సందేహంగా... భయంగా.. తండ్రి వైపు చూశాడు.

ఇప్పుడు కన్నడి కళ్ళే కాదు- తిరుపతి కళ్ళు కూడా కొడుకు కోరిక తీరబోతుందన్న ఆనందంతో మెరుస్తున్నాయి.

ఎదురింటి యశోదమ్మ కిందకు దిగి తన కొడుకుతో మాట్లాడడం విన్న 'మల్లి' పశ్చాత్తాపపడింది. ఈ మద్దెనే తనంది- పక్కింటి కోటేశ్వరితో... 'ఎంత పిసినారిది కాకపోతే... అంత డబ్బెట్టుకుని పుష్కరాలకు పోనే లేదు ఆ అమ్మ! నేనైతేనా..? డబ్బుంటే బస్సెక్కేయనూ?' అని...

'పుణ్యంకోసం పుష్కరాల కెళ్లాలా?"

– గుండెలు నిండిన కృతజ్ఞతతో చేతులు జోడించింది మల్లి.

●

'ఆంధ్రజ్యోతి' దినపత్రిక 'ఆదివారం అనుబంధం' ... 10 అక్టోబర్ 2004 సంచికలో ప్రచురితమైన కథ